క్లుప్తంగా

అనుచిత వ్యాఖ్యలు తగవు



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ఆదోని సెంట్రల్: ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన యతి నరసింహానంద సరస్వతి, వారి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముస్లిం మత గురువులు సాదిరూఫ్, జిలాన్ అజాద్, ఖాజీసాబ్ డిమాండ్ చేశారు. సోమవారం షాహీ జామియా మసీద్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఎత్తున శాంతి ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ ముస్లింల మనోభావాలు దెబ్బతినే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మత గురువులు నూర్ అహ్మద్, ఉమ్మీసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందమ్మకు న్యాయం చేయాలి


ఆరో రోజు దీక్షలో కూర్చున్న గోవిందమ్మ

ఎమ్మిగనూరుటౌన్: బీసీ కులస్తులు స్తంభానికి కట్టి దాడి చేసిన ఘటనలో గాయపడిన కల్లుకుంట్ల గ్రామానికి చెందిన గోవిందమ్మకు న్యాయం చేయాలని జేఏసీ నాయకులు నర్సన్న, రాజోలప్ప, ప్రసన్న, స్వామిదాస్, లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో గోవిందమ్మ చేపట్టిన నిరవధిక దీక్ష సోమవారం ఆరో రోజుకు చేరుకుంది. ఆమెకు వారు సంఘీభావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ ఈ కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆదోని రూరల్: దళిత మహిళ గోవిందమ్మకు న్యాయం చేయాలని మానవ హక్కుల పోరాట సంఘం నాయకులు శ్రీనివాసులు, వెంకప్ప, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కేదర్‌నాథ్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు.

స్వీపర్లకు వేతనాలివ్వాలి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, స్వీపర్లు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ స్వీపర్స్ (ఆయాలు)గా 34 మంది పనిచేస్తున్నారని, వారికి సకాలంలో వేతనాలు అందించాలని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట స్వీపర్లతో కలిపి ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, స్కూల్ సీపర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కల్లుబావి రాజు మాట్లాడుతూ స్వీపర్లకు ఇవ్వాల్సిన వేతనాలు సక్రమంగా అధికారులు ఇవ్వడం లేదన్నారు. ఈనెల 12వ తేదీన విజయదశమి పండగకు కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం

పెద్దకడబూరు : గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరాడుదామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు తిక్కన్న అధ్యక్షతన మండల పరిధిలోని బసలదొడ్డి, చిన్నతుంబళం గ్రామాలలో సోమవారం గ్రామ మహాసభలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో నెలకొన్న సమస్యలు సీసీ రోడ్లు, డ్రైనేజ్, పింఛన్లు తదితర సమస్యలను గ్రామ మహాసభల్లో గుర్తించి మండల, జిల్లా మహాసభల దృష్టికి తీసుకెళ్లి.. వాటి పరిష్కారానికై ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శ్రీనివాసులు, దేవదాసు, శాఖా కార్యదర్శులు హనుమంతు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

నందవరం: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఐ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పాత రెవెన్యూ కార్యాలయం వద్ద సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వహబ్, ఆర్ఐ జెర్మియాకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నాగలదిన్నె గ్రామంలోని తుంగభద్ర నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇసుక చోరీకి పాల్పడుతున్నారని వివరించారు. రెవెన్యూ, పోలీసు శాఖల సహకారం ఉండటంతో యథేచ్ఛగా రోజుకు 100 ట్రిప్పుల వరకు అక్రమ రవాణా సాగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం తాలూకా కార్యదర్శి శాంతన్న, సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, హమాలీ సంఘం నాయకులు మునిస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ జాగా.. పచ్చనేతల పాగా

- దేవబెట్టలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న టీడీపీ నేతలు
- దేవాలయానికి రస్తా పేరుతో కొండను కొల్లగొడుతున్న వైనం
- కళ్లు మూసుకున్న రెవెన్యూ అధికారులు
- ఆక్రమణలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన సర్పంచ్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పచ్చ నేతలు రెచ్చిపోతున్నారు.. ఏమి చేసినా మమ్మల్ని ఎవరు అడిగేది?, మాదే అధికారం అంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కళ్లకు కనిపించిన ప్రభుత్వ పోరంబోకు స్థలాలను కబ్జా చేస్తూ.. నాకొకటి నీకొకటి అనే విధంగా పంచుకుంటున్నారు.


కొండ రాళ్లను ప్రొక్లెయిన్‌తో కొల్లగొడుతున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో టీడీపీ నేతలు తమకు కనపించిన ప్రభుత్వ ఖాళీ పోరం బోకు స్థలాలను అక్రమించుకుంటున్నారు. దర్జాగా అమ్మకొని సొమ్ము చేసుకుంటున్నారు. వచ్చిన డబ్బును పచ్చనేతలు భాగాలు వేసుకొని పంచుకోవటం చర్చానీయంగా మారింది. ఇది చాలదన్నట్లు దేవాలయానికి రస్తా పేరుతో కొండను భారీ ప్రొక్లెయిన్‌తో కొల్లగొట్టి స్థలం చదును చేసుకొని ఆక్రమించుకోవడానికి సిద్ధమయ్యారు. దీంతో పచ్చనేతల ప్రభుత్వ పోరం బోకు భూముల ఆక్రమలణలను ఆపాలంటూ గ్రామ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ శేషఫణికి ఫిర్యాదు చేశారు.

దేవబెట్ట గ్రామంలో పచ్చనేతలు ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాలు..

- యాండా కేశన్న, యాండా రామకృష్ణ ఇంటి ముందు ఉన్న 10 సెంట్ల పోరం బోకు స్థలాన్ని టీడీపీ నేతలు సోమేశ్వరరెడ్డి, సోమశంకర్‌రెడ్డి, వడ్డె రాముడు ఆక్రమించుకొని.. సెంటు రూ. 3 లక్షల చొప్పున ఆదే గ్రామానికి చెందిన కొప్పుల దేవరెడ్డి, కొప్పుల ఈశ్వరప్ప, కొప్పుల వెంకటేష్, గందోజి, నరసింహులు, యండా రుక్కప్ప, వడ్డె శంకరప్పలకు విక్రయించారు.
- దేవమ్మ అవ్వ గుడి వద్ద ఉన్న కొండను దేవాలయానికి రస్తా పేరుతో అధికారుల అనుమతి లేకుండా టీడీపీ నాయకులు షేక్ మహబూబ్‌బాషా, జగదీష్‌లు కొండ రాళ్లను ప్రొక్లెయిన్‌తో పగలగొడుతూ స్థలం చదును చేసి ప్లాట్లుగా వేసి విక్రయించే పనిలో ఉన్నారు.
- గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు జలజీవన్ మిషన్ కింద మంజూరైన వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న 15 సెంట్ల పోరంబోకు స్థలంలో మట్టిని చదును చేసి ప్లాట్లు వేసేందకు వడ్డే రాముడు, వడ్డే వీరేష్, షేక్ మహబూబ్, జగదీష్‌లు సిద్ధమయ్యారు.
- సచివాలయం పక్కన ఉన్న 15 సెంట్ల పోరంబోకు భూమిని వడ్డే రాముడు, వడ్డే వీరేష్, షేక్ మహబూబ్, జగదీష్‌లు ఆక్రమించారు.
- దేవబెట్ట – ఎమ్మిగనూరు దారిలో వంక దగ్గర ఎకరా పోరంబోకు భూమి తన పేరున రిజిస్ట్రేషన్ అయ్యిందని జగదీష్ అనే వ్యక్తి ప్రజలను బెదిరించి ఆక్రమించుకున్నాడు. వీటితో పాటు జగనన్న కాలనీ సమీపంలోని కుక్కల బావి స్థలం, గొర్రెల పెంట దగ్గర వంక పోరంపోలాన్ని పచ్చనేతలు అక్రమించుకున్నారు.


ఆక్రమణలపై తహసీల్దార్ శేషఫణికి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ వెంకట్రామిరెడ్డి

- బొగ్గుల శంకరప్ప అనే వ్యక్తి తన పొలం, శ్మశానానికి మధ్య ఉన్న పంట కాలువను పూడ్చి స్థలాన్ని ఆక్రమించుకున్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు స్థలాలు కబ్జాలు, ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు కళ్లు మూసుకున్నారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురైనట్లు పిల్లవాడిని అడిగినా చెప్పుతారు.. అయితే అవి రెవెన్యూ అధికారులకు కనిపించకపోవడం విడ్డూరం. సచివాలయం పక్కనే ఆక్రమణలకు గురవుతుంటే సచివాలయ ఉద్యోగులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడం చర్చనీయాంశంగా మారింది.


నీళ్ల ట్యాంక్ దగ్గర అక్రమించుకునేందుకు చదును చేసిన స్థలం


10 సెంట్ల పోరం బోకు స్థలాన్ని విక్రయించగా.. బండలు హద్దులుగా వేసుకున్న కొనుగోలుదారులు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ పోరం బోకు స్థలాలను అక్రమించుకుంటే ఎంతటి వారైన కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనట్లు ఇంత వరకు మా దృష్టికి రాలేదు. సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తే తెలిసింది. కొండకు పట్టాలు ఇవ్వడం ఎక్కడా జరగదు. అలా ఇస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. స్థలాల అక్రమణపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– శేషఫణి, తహసీల్దార్, ఎమ్మిగనూరు

కేసు నమోదు

ఆదోని రూరల్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన ఓ స్థలం విషయంలో జరిగిన గొడవకు సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర సోమవారం రాత్రి విలేకరులకు తెలిపారు. మాల ఈరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాల మంగన్నతో పాటు మరో ఐదు మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మద్యం దుకాణాలకు 41 దరఖాస్తులు

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల కోసం ఆఫ్‌లైన్లో 41 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్లో ఎంత మంది చేసుకున్నారో తమ దృష్టికి రాదని చెప్పారు. ఎవరైనా రూ. 2 లక్షలు చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

రెక్కలకష్టం బూడిదపాలు


దగ్ధమైన పత్తి

మంత్రాలయం : ఓ రైతు రెక్కల కష్టం బూడిద పాలైంది. చేతికొచ్చిన పంట అనుకోకుండా దగ్ధమైంది. మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన చిన్న యేసేబు తెంపిన పత్తిని మిద్దెపై ఆరబోశాడు. విద్యుత్ సర్క్యూట్ తోనో లేక ఇతర కారణాలతో అనుకోకుండా పత్తికి నిప్పు రాజుకుంది. చిన్నగా మంట వ్యాపించి మొత్తం పొగలు రావడంతో చుట్టుపక్కలా వాళ్లు గమనించి విషయం రైతుకు చెప్పారు. బాధిత రైతు వెళ్లి చూడగా పత్తి మొత్తం కాలిపోయింది. దాదాపు 10 క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు రైతు వాపోయాడు. చేతికొచ్చిన పంట బూడిదపాలు కావడంతో కన్నీరు మున్నీరయ్యాడు.

భూముల రీ సర్వేలో పొరపాట్లు సరిచేయండి

ఎమ్మిగనూరుటౌన్: భూముల రీ సర్వేలో జరిగిన పొరపాట్లను సరిచేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సత్యన్న, నాయకులు బాలరాజు, హనుమంతు కోరారు. సోమవారం ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందించారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించండి


సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్‌లు వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ వంద శాతం మెరుగుపడాలి


చెత్త సేకరణను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో శానిటేషన్ వంద శాతం మెరుగుపడేలా ప్రతి శానిటరీ వర్కర్, ఉద్యోగి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. సోమవారం పట్టణంలోని 39వ వార్డులో శానిటేషన్ పనులను పరిశీలించారు. మురుగు కాలువలో పూడికతీత, ఇంటింటి చెత్త సేకరణ, తోపుడు బండ్లపై తడి,పొడి చెత్తను తరలించే ప్రక్రియను పరిశీలించారు. తడిపొడి చెత్తను వేర్వేరుగా ఉంచుతూ ఇంటి వద్దకు వచ్చే తోపుడు బండ్లు, టిప్పర్ లేదా లారీలో వేసి పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్యానికి సహకరించాలని 'పజలను కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వార్డు కౌన్సిలర్లు, స్వచ్ఛంద సేవా కార్యకర్తలు, ప్రజలు, మహిళలు, వివిధ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ


రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

గోనెగండ్ల : మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ఏడీఏ మహమ్మద్ ఖాద్రీతో సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ వేరుశనగ విత్తనాలు పూర్తి ధర క్వింటా రూ. 9,400 ఉండగా, 25 శాతం రూ.2,350 సబ్సిడీ పోను క్వింటా రూ.7,050 చెల్లించి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, ఏఓ హేమలత, సర్పంచ్ హైమవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆదోని సెంట్రల్: ఆదోని పురపాలక ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం పాఠశాలలో ఘనంగా జరిగింది. తమ విద్యనందించిన గురువులు విజయ కుమారి, ఫయాజ్, మోహన్ రావు, సిద్ధప్ప, నాగరాజరావులను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాలను కలయ తిరిగి తమ చిన్ననాటి చిలిపి చేష్టలు అల్లరితో కూడిన ఆటపాటలను గుర్తు చేసుకున్నారు. ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృత్తి, ఉద్యోగ రీత్యా ఆయా ప్రాంతాల్లో ఉన్నప్పటికీ పూర్వ విద్యార్థులు షాబీర్, వెంకటరెడ్డి తమ బ్యాచ్‌కు చెందిన మిత్రులందరినీ ఏకం చేసేందుకు కృషి చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.ఉచ్చీరప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బసరకోడు గ్రామశాఖ మహాసభను హుసేని అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ స్థానికంగా రోడ్డు సమస్యలు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వీటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని వారికి ఇంటి స్థలాలు పంపిణీ చేయాలన్నారు. అనంతరం శాఖ కార్యదర్శిగా రామాంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు మునిస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

నందవరం : ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఉపేంద్ర బాబు హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో తుంగభద్ర నదిలోని ఇసుక రీచ్‌ను, బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును సీఐ విక్రమసింహా ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులతో నియమ నిబంధనల మేరకే ఇసుకను తరలించాలన్నారు. అలాగే చెక్‌పోస్టు, ఇసుక రీచ్ వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

మున్సిపల్ స్థలం ఆక్రమణకు యత్నం


స్థలం వద్ద పాతిన బండలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కర్నూలు ప్రధాన రహదారిలో ఉన్న ఎద్దుల మార్కెట్ ఎదురుగా విలువైన మున్సిపల్ స్థలాన్ని సోమవారం ఆదోనికి చెందిన ఓ బీజేపీ నాయకుడు ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. ఆక్రమణ విషయం తెలుసున్న వెంటనే మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది అక్కడికి వెళ్లి స్థలం చుట్టూ పాతిన బండలను తొలగించారు. దాదాపు రెండున్న సెంట్ల విలువైన స్థలం మున్సిపాలిటీకి చెందినది కావడంతో గతంలో ఆప్రాంతంలో కొందరు బంకులు వేసుకోగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చొరవ తీసుకోవడంతో మున్సిపల్ అధికారులు స్థలాలను కాపాడి 'ఈ స్థలం మున్సిపాలిటీకి చెందినది' అని బోర్డులను ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కట్టేందుకు అప్పట్లో మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ విలువైన స్థలం మాదని పేర్కొంటూ బండలు పాతేందుకు ఉపక్రమించడం గమనార్హం.

పని భారం తగ్గించాలి

ఎమ్మిగనూరురూరల్/ఎమ్మిగనూరుటౌన్: అంగన్‌వాడీ వర్కర్లకు పనిభారం తగ్గించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, టౌన్ కార్యదర్శి నాగలక్ష్మి, సీఐటీయూ తాలూకా కార్యదర్శి రాముడు కోరారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ సఫర్నీసాబేగంకు వినతి పత్రం అందజేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఒకే యాప్ ఉండాలని కోరారు. నాగలక్ష్మీ, మున్ని, శైలజ, మేరీ ఉన్నారు.

బహురూపాల్లో అమ్మవారు


నువ్వులు, సోయాబీన్స్ అలంకరణలో శ్రీ లక్ష్మమ్మవ్వ


పంచముఖి గాయత్రీదేవిగా శ్రీ అంబాభవానీదేవి


అర్ధనారీశ్వర రూపంలో వాసవీమాత


మంత్రాలయం: వాసవీ మాతకు పూజలు

ఆదోని అర్బన్: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా 5వ రోజు సోమవారం అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నువ్వులు, సోయాబీన్స్‌తో శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వను అలంకరించారు. అలాగే బిల్వపత్రి అలంకారంలో పేట వీరభద్రస్వామి, పంచముఖి గాయత్రీదేవి అలంకారంలో ఫారెస్ట్ లైన్ శ్రీ అంబాభవానీదేవి, లక్ష్మీ నరసింహస్వామి అలంకారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు, ఉమామహేశ్వర అలంకారంలో శ్రీ నగరేశ్వర స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

ఆదోని రూరల్: మండలంలోని జాలిమంచి గ్రామంలో వెలసిన అంబాభవాని ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మండలంలోని నెట్టేకల్ గ్రామానికి వెళ్లే రహదారిలో వెలిసిన దొండు మారెమ్మవ్వ వారు చండీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని రామలింగేశ్వర చౌడేశ్వరి దేవి ఆలయంలో శ్రీ మహాచండీ దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్ధనారీశ్వరుడి రూపంలో, జమ్ములమ్మ ఆలయంలో కైలాసగిరి పర్వత అలంకరణలో శివపార్వతుల అలంకరణలో దర్శనమిచ్చారు.

నందవరం : గురజాల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పార్వతీదేవిని మహాచండీ దేవిగా అలంకరించారు. టి.సోమలగూడూరు గ్రామంలో శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులు దర్శించుకున్నారు.

మహాచండీగా వాసవీమాత

మంత్రాలయం : మండల కేంద్రంలోని వాసవీ కల్యాణ మండపంలో కొలువుదీరిన వాసవీమాతను మహాచండీగా అలంకరించారు. కౌతాళం మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో వెలసిన గ్రామ దేవత మారెమ్మ మహాచండీ అలంకరణలో విశేషంగా ఆకట్టుకున్నారు.

పెద్దకడబూరు : మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామ శివాలయంలో వెలసిన పార్వతీదేవి లలిత త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని కాళీమాత, చౌడేశ్వరిదేవి, పెద్ద లక్ష్మమ్మవ్వ వివిధ రూపాలలో భక్తులను కనువిందు చేశారు.

కోసిగి: కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి ఆలయంలో అమ్మవారు స్కందమాత దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వెండికవచ అలంకరణలు , ఫల, పుష్పాలంకరణలు గావించి ప్రత్యేక పూజలు చేశారు.


జాలిమంచిలో సరస్వతి దేవిగా అంబాభవాని


దొడ్డిమేకలలో లలితా త్రిపురసుందరి దేవిగా..


ఉప్పరహాల్‌లో మహాచండీగా మారెమ్మ